ప్రజాశక్తి

శనివారం 26 నవంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





దళిత క్రైస్తవులను
ఎస్‌సి జాబితాలో చేర్చేందుకు కృషి

- దళితులకు శ్మశానస్థలాల ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు ఆనంద్ ప్రకాష్



మాట్లాడుతున్న ఆనంద్ ప్రకాష్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో దళిత క్రైస్తవులను ఎస్‌సి జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్ ప్రకాష్ పేర్కొన్నారు. జిల్లాలోని దళిత సమస్యలు తెలుసుకునేందుకు ఆయన శుక్రవారం ఒంగోలుకు వచ్చారు. స్థానిక అంబేద్కర్ భవనంలో దళితులు, దళిత, ప్రజా సంఘాల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు మాట్లాడుతూ దళిత క్రైస్తవు లను ఎస్‌సి జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై త్వరలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దళిత క్రైస్తవులను ఎస్‌సి జాబితాలో చేర్చి వారు రిజర్వేషన్ ఫలాలను పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 1950 నుంచి దేశంలోని దళితులు 15 శాతం రిజర్వేషన్ పొందుతున్నారని, ప్రస్తుత పరిస్థితులలో 25 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని జిల్లాలలో అట్రాసిటీ కేసులను తప్పుడు కేసులుగా మారుస్తున్నట్లు నివేదికలు అందుతున్నాయని, వీటిపై కమిషన్ సీరియస్‌గా ఉందన్నారు. అట్రాసిటీ కేసులను ఫాల్స్ కేసులుగా మారిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే దళితులకు శ్మశాన స్థలాలు ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రభుత్వానికి నివేదించామని, కమిషన్ సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లోని దళితులకు శ్మశాన స్థలాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు లక్ష్మా నాయక్ మాట్లాడుతూ కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని 38 మండలాలలో దళితుల కోసం శ్మశాన స్థలాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సమితి అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య, వివిధ దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాగాణి సాగుకు దూరం

- వరి పంటను వదిలేస్తున్న కౌలు రైతులు
- గిట్టుబాటు కానందునే ఈ ఏడాది విపత్కర నిర్ణయం
- కౌలు తగ్గించినా తప్పని నష్టాలు..
- ఆహారపంటల సాగుపై ప్రభావం



వరినాట్లు పడక బీడుగా ఉన్న భూమి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కౌలు రైతులు ఇప్పుడు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. భూమి ఉన్న రైతులకే ఏ పంటకూ గిట్టుబాటు ధరల్లేక నష్టాలపాలయ్యారు. ఎందరో రైతులు అప్పులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. నష్టాల నుంచి తేరుకోలేని రైతులు భూములను కౌలుకు ఇస్తున్నారు. కౌలు రైతులూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో లక్షన్నర మంది వరకూ ఉన్నారు. ఈ గణాంకాలు కూడా వ్యవసాయ శాఖ వద్ద అధికారికంగా లేవు. ఐదారేళ్ల నుంచి కౌలు రైతులు నష్టాలపాలవుతున్నారు. కొన్ని పంటల్లో పెట్టుబడులు కూడా రావడం లేదు. కొన్ని పంటల్లో ఆ ఏడాది ధరలను బట్టి బయటపడుతున్నారు. మాగాణి సాగులో ఉన్న రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. దీంతో ఈ ఏడాది మాగాణి సాగుకు కౌలు రైతులు మొగ్గుచూపడం లేదు.

చాలా చోట్ల కౌలు రైతులు మాగాణి సాగును వదిలేశారు. సగానికి సగం మంది సాగు చాలించుకున్నారని అంచనా. కారణం గిట్టుబాటు కానందునే.. గతంలో ఎకరాకు 12 బస్తాల కౌలు ఉండేది. రెండేళ్ల నుంచి దాన్ని కూడా తగ్గించారు. ఎకరాకు ఎనిమిది బస్తాలకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. కౌలు రైతులకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో సాగును వదిలేస్తున్నారు. కొమ్మమూరు కాలువ కింద ఎక్కువ శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. దర్శి ఇరిగేషన్ డివిజన్‌లో కొంత మేరకు ఉన్నారు. మొత్తం మీద మాగాణిలో కౌలురైతులు సుమారు 25 వేల మంది వరకూ ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది వీరిలో 10 వేల మంది లోపే మాగాణి సాగులో ఉన్నట్లు తెలుస్తోంది. కొమ్మమూరు కాలువ పరిధిలో కారంచేడు, చుట్టుపక్కల గ్రామాల్లోనే కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. గతేడాది సాగు చేసిన భూములను ఈ ఏడాది వదిలేశారు. రైతులు కూడా సాగు చేయడం లేదు. చాలా చోట్ల మాగాణి భూములు దుక్కులు కూడా దున్నడం లేదు. ఈ విపత్కర పరిస్థితికి కారణం సాగులో నష్టాలు రావడమే తప్ప మరో అంశం ఏమీ లేదు. ఎకరా మాగాణి సాగుకు పెట్టుబడి ఇప్పుడు కనీసం రూ.35 వేల నుంచి రూ.40 వేలు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 30 బస్తాలు సగటు ధాన్యం పండుతుంది. కౌలు కింద 10 బస్తాలు పోతే మిగిలేది 20 బస్తాలు. బస్తాకు రూ.1100 మించి ధర లేదు. ఈ లెక్కన 20 బస్తాలకు రైతులకు అందేది రూ.22 వేలు. చేతికి అందిన సొమ్ము పోగా ఇంకా ▶ 2లో

పురోగమనమా..తిరోగమనమా.?

- ఒంగోలు డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ అంతా తప్పులతడకలు
- అవగాహన లేని ప్రైవేటు ఏజెన్సీకి ప్లాన్ తయారీ బాధ్యతలు
- డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు, సూచనలకు నేడే చివరి రోజు



ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఏదైనా నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్‌ప్లాన్ చాలా ముఖ్యం. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ప్రతిపాదనల ప్రకారమే రోడ్లను అభివృద్ధి చేస్తారు. నగర అభివృద్ధిలో ఎంతో కీలకపాత్ర వహించే మాస్టర్‌ప్లాన్ తయారీ విషయంలో ఒంగోలులో అనేక తప్పిదాలు చోటుచేసుకోవడం పట్ల నగర అభివృద్ధి కాముకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఈ పాటికే ఉన్న రోడ్లను విస్తరించకపోగా రోడ్డు వెడల్పు, పొడవులను తగ్గించడం, కొన్ని చోట్ల పాత రోడ్లను ఎత్తివేయడం వివాదాస్పదంగా మారింది. కొత్తగా ప్రతిపాదిస్తున్న మాస్టర్‌ప్లాన్‌లో ఒకే ఒక కొత్త రోడ్డును మాత్రమే చూపించారు. మాస్టర్‌ప్లాన్ తయారీ బాధ్యతను ఒంగోలు మీద అస్సలు ఏ మాత్రం అవగాహన లేని ఓ ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించడమే తప్పిదాలకు కారణమని తెలుస్తోంది.

సరైన రీతిలో వారితో ప్లాన్ తయారు చేయించాల్సిన ఒంగోలు నగరపాలక సంస్థ, ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటి(ఒడా) అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావసానంగా కొత్తగా ఏర్పాటయ్యే రోడ్ల మాట అటుంచితే ఉన్న రోడ్లనే కుదించడం, ఎత్తేయడం పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే 20 ఏళ్ల పాటు అమల్లో ఉండాల్సిన మాస్టర్‌ప్లాన్ తయారీ విషయంలో అధికారులు చేసిన తప్పిదాలు భవిష్యత్తు నగర అభివృద్ధికి విఘాతాలు కానున్నాయనే చర్చ జోరుగా జరుగుతోంది.

ప్రస్తుతం ఒంగోలులో అమల్లో ఉన్న మాస్టర్‌ప్లాన్ 2017లో తయారుచేసింది. దాని ఆధారంగా కొత్తగా మాస్టర్‌ప్లాన్ తయారీ బాధ్యతను ఢిల్లీకి చెందిన రుద్రాభిషేక్ కన్సల్టెన్సీ ఏజెన్సీకి అప్పగించారు. 2017లో తయారు చేసిన మాస్టర్‌ప్లాన్‌లో ఒంగోలు కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలు లేవు. ప్రస్తుతం తయారుచేసిన ప్లాన్‌లో వాటిని కలిపారు. కొత్త మాస్టర్‌ప్లాన్ తయారు చేయించిన అధికారులు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ పేరుతో గత నెల 27న నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నెల 26 వరకే డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ మీద అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తారు.

డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ మీద వచ్చిన అభ్యంతరాలు, సూచనలు, సలహాలు పరిశీలించిన తరువాత కొద్దిరోజులకు అధికారులు డిటిసిపి ద్వారా ప్రభుత్వ ఆమోదానికి పంపుతారు. ప్రభుత్వ ఆమోదం తరువాత నూతన మాస్టర్‌ప్లాన్ అమ ల్లోకి వస్తుంది. కొత్త మాస్టర్‌ప్లాన్ ప్రభుత్వం ఆమోదించిన తరువాత అది రాబోయే 20 సంవత్సరాలు అంటే 2041 వరకు అమలులో ఉంటుంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ తయారిలో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నట్లు పలువురు మేధావులు విమర్శిస్తున్నారు. ఇటీవల కార్పొరేటర్లకు డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్ మీద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాబోయే 20 ఏళ్లలో ఒంగోలు నగర జనాభా రెట్టింపు కానున్నదని అధికారులు ప్రకటించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఒంగోలు ప్రస్తుత జనాభా సుమారు 3 లక్షలా 8 వేలకు పై చిలుకు. 2041 నాటికి ఇది కాస్త 6 లక్షలా 63 వేలు దాటుతోందని ఓ అంచనా. అంటే అప్పటివరకు నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పన అంతా ప్రధానంగా రోడ్లు, కాల్వల ▶ 2లో

తహశీల్దార్లు జారీ చేసిన
ఎన్‌ఒసిలపై నివేదికలివ్వండి

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేసిన అక్రమ లేఅవుట్ల ఏర్పాటుపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఎన్.ఓ.సి.లపై విచారణ చేయాలని, బాపట్ల జిల్లాగా ఏర్పడిన నాటినుంచి తహసిల్దార్లు జారీ చేసిన ఎన్.ఓ.సి. లపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో అధికారులు, సిబ్బందితో శుక్రవారం కలెక్టర్ సమావేశమయ్యారు. ఎన్.ఓ.సి.లకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించాలన్నారు. అక్రమ లేఅవుట్ల క్రమ బద్ధీకరణ కోసం జరిమాన చెల్లింపులపై యంత్రాంగం దృష్టి పెట్టేలా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారంతా విధిగా గ్రామ, వార్డు సచివాలయాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో సిపిఓ జి భరత్, డిపిఓ రమేష్, వివిధ శాఖల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్సడా వైస్ ఛైర్మన్ రఘురాం

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి
ప్రభుత్వం సిద్ధం

8లో ▶

మాగాణి సాగుకు దూరం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడి కోసం పెట్టినదే రూ.20 వేలు రావాలి. వరిగడ్డి అమ్ముకుంటే రూ.5 వేలు వస్తుంది. ఇంకా రూ.15 వేలు ఆర్థిక నష్టమే కనిపిస్తోంది. ఆరు నెలలపాటు శ్రమను పరిగణలోకి తీసుకుంటే ఇంకా ఎక్కువగానే నష్టం కనిపిస్తోంది. ఎకరాకు కనీసం రూ.15 వేలు నష్టపోతున్నారు. దీంతో మాగాణిలోకి దిగాలంటేనే ఇప్పుడు రైతులు భయపడుతున్నారు. నష్టం తప్ప లాభం లేదు. అసలు కూడా రావడంలేదనే సాగును వదిలేస్తున్నారు. ఇక కౌలు రైతులకు ఎటువంటి గుర్తింపు కార్డులు కూడా అందడం లేదు. జిల్లాలో అన్ని పంటల సాగులో లక్షన్నర మంది ఉంటే పది వేల మందికి కూడా కార్డులు ఇవ్వడం లేదు. కార్డులు ఇచ్చినా బ్యాంకులు రుణాలు ఇవ్వడం పెద్ద సమస్యగా మారింది. భూమి రైతుల పేరున ఉన్నందున రుణాలు ఇవ్వడం సాంకేతికంగా ఇబ్బందిగా మారింది. దీంతో కౌలు రైతుల కోసం ఎన్ని చట్టాలు చేసినా ఫలితం లేదు. ఆచరణలో కౌలు రైతులు ప్రైవేటు అప్పులపైనే ఆధార పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్నారు. ఇక్కడే కౌలు రైతులు నష్టపోవడానికి బీజాలు పడుతున్నాయి. ఈ ఏడాది గణనీయంగా మాగాణి సాగును కౌలు రైతులు వదిలేస్తున్నారు. భూమి యజ మానులు కూడా సాగు చేయడం లేదు. ఇదే కారణాలతో సాగర్ ఆయకట్టులో సాగు కూడా తగ్గుతోంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. మాగాణి సాగు ఆగిపోతే భవిష్యత్‌లో ఆహారభద్రతకూ ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది.

పురోగమనమా..తిరోగమనమా.?

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు ప్రస్తుత మాస్టర్‌ప్లాన్ మీదనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం అధికారులు ఇచ్చిన డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌ను చూస్తే ఒంగోలు నగర అభివృద్ధి రాబోయే రోజుల్లో పురోగమిస్తుందా.! తిరోగమనిస్తుందా.! అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపాదిత డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌లో జరిగిన పలు తప్పిదాలపై వస్తున్న అభ్యంతరాలలో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే....

– అంజయ్య రోడ్డునుంచి పివిఆర్ బాలుర పాఠశాల రోడ్డు ప్రస్తుత మాస్టర్‌ప్లాన్‌లో 80 అడుగులు ఉంటే డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌లో 60 అడుగులకు తగ్గించారు.

– కరవది డొంక రోడ్డు వై జంక్షన్ నుంచి పోతురాజు కాలువ మీదుగా దశరాజుపల్లి వెళ్లే రోడ్డు ప్రస్తుతం 100 అడుగులు ఉంటే కొంతదూరం 80 అడుగులు చూపించారు. మరికొంత దూరం అస్సలు రోడ్డే లేకుండా ఎత్తేశారు.

– పోతురాజు కాలువకు ఇరువైపులా ప్రస్తుతం అమల్లో ఉన్న మాస్టర్‌ప్లాన్‌లో 60 అడుగుల సర్వీసు రోడ్డు ఉంది. కొత్తగా ప్రతిపాదించిన డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌లో రెండు వైపులా రోడ్లను ఎత్తేశారు.

– రైల్వేట్రాక్ రెండు వైపులా 60 అడుగుల సర్వీసు రోడ్డు ఉంటే దాన్ని కూడా ఎత్తేశారు.

– మంగమూరు రోడ్డు నుంచి సాగర్ కెనాల్ మీదుగా సర్వే నెంబర్ 266, 262, 220, 219 వరకు ప్రస్తుతం 80 అడుగుల రోడ్డు ఉంటే దాన్ని 60 అడుగులకు తగ్గించారు.

– మున్సిపల్ ఆఫీసు ముందు గవర్నర్ రోడ్డు 60 అడుగులు ఉన్న దాన్ని 40 అడుగులకు తగ్గించారు.

– విరాట్‌నగర్ రోడ్డు 80 అడుగులు ఉన్న దానిని 60 అడుగులకు తగ్గించారు.

– సాగర్ కెనాల్ దక్షిణం సర్వే నెంబర్ 93, 97, 99, 109 నుంచి రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మీదుగా చెరువు కొమ్ముపాలెం వెళ్లే రోడ్డు ప్రస్తుతం 100 అడుగులు ఉంటే ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్‌లో దాన్ని పూర్తిగా ఎత్తేశారు.

– కొత్త కూరగాయాల మార్కెట్ నుంచి బండ్లమిట్టకు వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న 80 అడుగుల రోడ్డును డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌లో పూర్తిగా ఎత్తేశారు.

– సర్వే నెంబర్ 33, 77, 81, 82, 87, 340, 208, 209, 210, 215, 320, 338తో పాటు మరికొన్ని సర్వే నెంబర్లను రెండు చోట్ల నమోదు చేశారు.

యాప్‌లపై అవగాహన కలిగి ఉండాలి

స్టేట్ ఫిమేల్ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష



మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

ఒంగోలు కలెక్టరేట్ : వైద్య, ఆరోగ్యశాఖలోని యాప్‌లపై వైద్యాధి కారులు, ఎఎన్ఎంలు అవగాహన కలిగి ఉండాలని స్టేట్ ఫిమేల్ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ విద్యార్థులకు స్క్రీనింగ్, ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ పరిశీలన, నాన్ కమ్యూనికల్ డిసీజెస్, మన్మోల్ యాప్, లెప్రసీ డిటెక్షన్ యాప్, సాన్స్ యాప్ పరిశీలనకు శిరీష శుక్రవారం ఒంగోలు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యాధికారులు, ఎఎన్ఎంలు సమన్వ యంతో వివిధ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. యాప్‌లపై వైద్యాధికారులు, ఎఎన్ఎంలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. అనంతరం టంగుటూరు, పెట్లూరు ఆరోగ్య కేంద్రాలను డాక్టర్ శిరీష సందర్శిం చారు. ఈ సమావేశంలో ఉప వైద్య అధికారి డాక్టర్ మాధవీలత, డిపిఎంఒ డాక్టర్ వాణిశ్రీ, డిపిహెచ్ఎన్ఒ సుగుణమ్మ, డిపిఒ సుబ్బలక్ష్మి, పాల్గొన్నారు.

వ్య.కా.సం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

హనుమంతునిపాడు : ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో డిశంబర్ 8,9,10 తేదీల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ కోరారు. మహాసభలకు సబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ మహాసభల సందర్భంగా 8వ తేదీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మహాసభల్లో గత మూడు సంవత్సరాల కాలంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను సమీక్షించి నూతన కర్తవ్యాలను రూపొదించనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు చేసి పేదలకు భూమి, ఇంటి స్థలం, పక్కాగృహాలు నిర్మించాలని, కనీస వేతన చట్టం, ఉపాధి గ్యారెంటీ కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షుడు పోతురాజు, మంగయ్య, మండల కార్యదర్శి గురునాథం, రాములు,మండల కమిటీ సభ్యుడు గూడూరు జయన్న, కెవిపిఎస్ నాయకుడు కత్తి ఏబు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-దర్శి

పారిశుధ్య కార్మికులకు 12 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు దర్శి కార్యదర్శి తాండవ రంగారావు కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆలూరి ఇస్మాయిల్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు గ్రామాలలో పనిచేస్తున్న పారిశు ధ్య కార్మికులకు నెలకు ఇచ్చే రూ. 6 వేలు కూడా 12 నెలలుగా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటయ్య, ఆశీర్వాదం, ఎడ్జర్, ఆనందరావు, గంగయ్య, దానయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ : వరికూటి

ప్రజాశక్తి -శింగరాయకొండ



అశోక్‌బాబును సన్మానిస్తున్న ఎంపిటిసి

సమస్యల పరిష్కారం కోసం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. శింగరాయకొండ–1 సచివాలయ పరిధిలోని రైల్వే రోడ్, ఆర్ఎస్ పాఠశాల, రజక పాలెం, జాలమ్మ చెట్టు వీధి, సోమరాజు పల్లి రోడ్డు, మేదర సంఘం, దామచర్ల ఆంజనేయులు కాలనీ, జివిఆర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు పార్లమెంట్ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి , కోఆప్షన్ మెంబర్ ఎస్‌డి.సర్దార్ , సర్పంచి తాడిపర్తి వనజ , ఎంపిటిసి సోమిశెట్టి వాసవిదేవి , మసనం వెంకటరత్నం, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కె. లియాఖత్ హాజరయ్యారు. వైసిపి నాయకులు మసనం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

పొదిలి : పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఎఒ శైలజ తెలిపారు. మండల పరిధిలోని ఏలూరు, ఉప్పలపాడు, ఆముదాలపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులు సాగు చేసిన పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఒ జైనులాబ్దీన్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దూదేకుల షరీఫ్, షేక్ సైదు గోపి అను విద్యార్థులు మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గ్రామ వైసిపి నాయకులు ఆలూరి శ్రీనివాసరావు పది వేల రూపాయల బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కరాటే నేర్పిన బ్లాక్ బెల్ట్ డాన్, గంటెనిపాటి అఖిల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రిటైర్డ్ వైద్యాధికారి మురళీధర్ మాట్లాడుతూ, విద్యార్థులకు కరాటేతో పాటు క్రమశిక్షణ కూడా అవసరమని అన్నారు. కరాటేతో ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటి సుబ్బారావు, కారసాని వెంకటరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స.హ. చట్టం అమలులో అధికారుల మీనమేషాలు

ఒకే కేసులో రెండుసార్లు నష్టపరిహారం విధించిన కమిషన్ • స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక ఎంపిడిఓ కార్యాలయ అధికారులు సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఒకే కేసులో రెండోసారి నష్టపరిహారం చెల్లించడానికి సిద్ధపడ్డారు. సమాచారం ఇవ్వడానికి మాత్రం ససేమిరా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ ఉత్తర్వులను అమలు చేయనందున రెండోసారి పదివేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. వేటపాలేనికి సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారుడు నాయుడు నాగార్జునరెడ్డి శుక్రవారం విలేకర్లకు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ కార్యాలయంలో చెట్లు అక్రమంగా నరికేసిన విషయం గురించి అందుకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం నాయుడు నాగార్జునరెడ్డి దరఖాస్తు చేశారు. దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌కు అప్పీల్‌కు వెళ్లారు. మొదటిసారి దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వాలని కమిషన్ ఆదేశించిన సమాచారం ఇవ్వలేదు. సమాచారం ఇవ్వకపోవడంతో పదివేల రూపాయలు దరఖాస్తుదారునికి నష్టపరిహారం చెల్లించి, సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. నష్టపరిహారం పదివేల రూపాయలు చెల్లించారు. సమాచారం మాత్రం ఇవ్వలేదు. దరఖాస్తుదారుడు మళ్లీ కమిషన్‌కు అప్పీల్‌కు వెళ్లారు. కమిషన్ ఆదేశాలు పాటించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి మరో పదివేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి, రెండు వారాల్లో సమాచారం అందించాలన్నారు. డిసెంబర్ 26న వ్యక్తిగతంగా సమాచార అధికారి హాజరు కావాల్సిందిగా ఈ నెల 15వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. లేని యెడల చట్టపరమైన చర్యలకు ఆదేశించవలసి ఉంటుందని కమిషన్ పిఐఓను హెచ్చరించింది.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

బాలిక అదృశ్యమైన ఘటన ఒంగోలు నగరంలో గురువారం చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భాగ్యనగర్ 3వ లైన్‌లో కిజ్జర్ బాషా నివాసముంటున్నారు. అతని కుమార్తె నగరంలోని గోపాలనగర్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుకుంటోంది. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి వస్తుంటుంది. గురువారం ఉదయం రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం తండ్రి భోజనం తీసుకొని వెళ్లేసరికి స్కూల్ యాజమాన్యం మీ కుమార్తె ఈ రోజు స్కూల్‌కు రాలేదన్నారు. దీంతో బాషా తన బంధువులు, తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో బాలిక తండ్రి కిజర్‌బాషా వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు స్టేషన్‌లో వార్షిక తనిఖీ

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం పోలీస్ స్టేషన్లో శుక్రవారం జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్ఐ పనితీరు మరియు సిబ్బంది పనితీరును, క్రైమ్ రేట్‌ని ఎలా నివారించాలి, ఏ ప్రాంతాల్లో ఎక్కువగా యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి వాటిని ఎలా నివారించాలి అనే అంశాలపై ఆయన సూచనలు చేశారు. మైనర్ బాలురకు బైకులు ఇవ్వకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలని అన్నారు. బైకు, సెల్ ఫోన్ దొంగతనాలు అరికట్టడం వంటి పలు అంశాల గురించి ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె రూరల్ సీఐ శివశంకర్, డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ సిఐ ఏ శ్రీనివాస్, ఎస్ఐ రోశయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-సంతమాగులూరు

జీవో ఎంఎస్ 13 ప్రకారం గ్రామ స్థాయిలో బాల్య వివాహ నిషేధ కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలోని అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. శుక్రవారం సంతమాగులూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీడీవో ఎం సాంబశివరావు అధ్యక్షతన ఐసిడిఎస్ ప్రాజెక్టు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీపీ ఎనుబర్ల ఎల్లమంద, ఎంఈఓ వి కోటేశ్వరరావు, సిడిపిఓ డి సుధ, ఏపిఎం దుడ్డు మస్తాన్‌రావు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు ఇల్లూరి లక్ష్మీ శేషు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివోఏలు, డ్వాక్రా గ్రూపు మహిళలు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రవికిరణ్బాయి

రహదారుల అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండల కేంద్రం భట్టిప్రోలులోని అద్దేపల్లిలో పెండింగులో ఉన్న రహదారులకు శుక్రవారం గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్బాయి శంకుస్థాపన చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున ఆదేశానుసారం గ్రామంలో అర్థాంతరంగా నిలిచిపోయిన రహదార్లు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, ఏఈ రామచంద్రరావు, నాయకులు చెన్నయ్య, బాలాజీ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండలంలో రెండో విడత నాడు-నేడు పనుల్లో భాగంగా భట్టిప్రోలు బిఆర్ పాఠశాలకు రూ.11.90 లక్షల నిధులతో జరిగే పనులను శుక్రవారం ఎంపిపి డివి లాలితకుమారి, జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని వారు సూచించారు.

క్యాన్సర్ పట్ల నిర్లక్ష్యం వద్దు: డాక్టర్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-చీరాల: క్యాన్సర్ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తమై ముందస్తుగా వ్యాధిని గుర్తించినట్లయితే అత్యాధునిక వైద్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చునని క్యాన్సర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ వై రామకృష్ణారెడ్డి అన్నారు. ఒంగోలు హెచ్‌సిసి జీఎంఎన్ ఆర్ క్యాన్సర్ హాస్పిటల్, చీరాల ఏరియా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను వైద్యులు రామకృష్ణారెడ్డి పరీక్షించి పలు సూచనలను అందజేశారు. మహిళలకు రొమ్ము, గర్భాశయం, అండాశయ క్యాన్సర్‌లపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా పురుషులలో పొగాకు, ఖైనీల నుంచి సంక్రమించే క్యాన్సర్లను ముందుగానే గుర్తించి వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలో రోగులకు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-నగరం



పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహిస్తున్న ఎస్‌పి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కళాశాలలో ర్యాగింగ్ వంటి వాటిని ప్రోత్సహించరాదని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్, దిశ యాప్, ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. కళాశాల యాజమాన్యం ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవ వందనంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దిశా యాప్‌ను చరవాణిల్లో నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. కళాశాల కస్పాండెంట్ బుచ్చయ్య చౌదరి మాట్లాడారు. ఎస్పీ వకుల్ జిందాల్‌ను, రేపల్లె డిఎస్పి మురళీకృష్ణను పూలమాలతో సత్కరించారు. రేపల్లె రూరల్ సీఐ శివశంకర్, నగరం ఎస్ఐ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోగినేని హనుమంతరావు, హరికృష్ణ, విష్ణువర్ధన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల వలసలు అరికట్టాలి

ప్రజాశక్తి-పంగులూరు

వ్యవసాయ పనులు సక్రమంగా లేక, ఉన్న కొద్దిపాటి పనులకు కూడా సరైన కూలి లేక, వ్యవసాయ కూలీలు వలసపోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం ఈ వలసలను నివారించేలా తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం పంగులూరు మండల కమిటీ సమావేశం తీర్మానించింది. మండల కమిటీ సమావేశం శుక్రవారం పంగులూరులో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో, మండలంలో వ్యవసాయ పనులు ప్రస్తుతం కొద్దిపాటి మాత్రమే ఉన్నాయని, పనులు లేక అనేక గ్రామాల ప్రజలు ఆటోలలో ఇతర గ్రామాలకు వలసలు పోతున్నారని, కూలి కూడా రూ.200-250కి మించి ఇవ్వట్లేదని సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. ఇక్కడ పనులు లేకపోవడం వలన, డిసెంబర్ నుంచి పొగాకు పనులకు మండలం నుంచి, భారీ సంఖ్యలో వలసలు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధి హామీ పనులు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామాల్లో సక్రమంగా జరగకపోవడం వలన, కూడా వ్యవసాయ కార్మికులు ఎక్కువమంది వలసలు పోతున్నారని సమావేశం తెలిపింది. వలసలు నివారించేదుకు ఉపాధి హామీ పనులను పగడ్బందీగా, అమలు జరపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్‌గా, పూసపాటి సుబ్బరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా తానికొండ సుధాకర్, పోతుగంటి ఆదంసాహెబ్, చింతల చెరువు ఏలియా, నాగేశ్వరరావు, హరిబాబులను ఎన్నుకున్నారు.

మార్కెట్ రుసుం వంద రూపాయలు కట్టలేం

ప్రజాశక్తి-వేటపాలెం

పంచాయతీ మార్కెట్ రుసుం యాభై, వంద ఎక్కడ నుంచి తెచ్చి కట్టాలి..? ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ చేపలు పట్టుకొని తెచ్చి అమ్ముకునే వాళ్లం.. తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల ఎంపిడిఓ ఎవిఎస్ శర్మకు శుక్రవారం వినతి పత్రం అందించారు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ కొత్తకాల్వ బ్రిడ్జి వద్ద గిరిజనులు, ఇతర చిరువ్యాపారులు చేపలు, మాంసం విక్రయిస్తుంటారు. విక్రయదారుల నుంచి రామన్నపేట పంచాయతీ సిబ్బంది 20 రూపాయలు మార్కెట్ రుసుం వసూలు చేశారు. ఇటీవల పంచాయతీ అధికారులు మార్కెట్ రుసుం వసూలుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మార్కెట్ రుసుం వసూలును దక్కించుకున్న గుత్తేదారుడు ఉదయం, సాయంత్రం కలిపి రోజుకు వంద రూపాయలు, ప్రతి ఆదివారం ఒక పూటకు వంద రూపాయలు ఇవ్వాలని తమను డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. వందల రూపాయలు ఎక్కడి నుంచి తేవాలి? తాము రెక్కలు ముక్కలు చేసుకుంటే వచ్చేది రెండు, మూడు వందలేనని ఆవేదన వ్యక్తం చేశారు. తమ యందు దయచూపి మార్కెట్ రుసుం మునుపటి మాదిరిగా ఇరవై రూపాయలకు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ పద్మ, టి కొండలు, వి హరిబాబు, ఎం బాలకోటయ్య, వెంకట రమణ, కుంభా రాములమ్మ, బి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆడ దూడలకు బ్రూసిల్లా వ్యాక్సిన్

ముప్పవరం పశువైద్యాధికారి డాక్టర్ మల్లేశ్వరి

ప్రజాశక్తి-పంగులూరు



గేదెకు వ్యాక్సిన్ వేస్తున్న ముప్పవరం పశువైద్యాధికారి డాక్టర్ మల్లేశ్వరి

పశువులు గర్భం దాల్చినప్పుడు ఈసకపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అలా జరగకుండా ఉండేందుకు ఆడదూడలు, నాలుగు నెలల నుంచి, 8 నెలల వయసులో బ్రూసిల్లా వ్యాక్సిన్ వేస్తున్నామని, ముప్పవరం పశు వైద్యాధికారి డాక్టర్ వైడిఎస్ మల్లేశ్వరి తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ స్కీము అమలు జరుగుతుందని, మూడు ఫేసుల్లో ఈ వ్యాక్సిన్ దూడలకు వేస్తున్నామని ఆమె తెలిపారు. శుక్రవారం ముప్పవరంలో ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఇప్పటికే ఫిబ్రవరి, ఆగస్టు, నెలలో రెండు ఫేసుల్లో వ్యాక్సిన్ వేశామని, ఇప్పుడు మూడో ఫేసు నవంబర్‌లో కూడా వేస్తున్నామని చెప్పారు. ఆడదూడలు ఉన్న రైతులు తప్పనిసరిగా, తమ దూడలకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. తెల్లజాతి పశువులైన ఆవులు, కోడె దూడల్లో ముద్ద చర్మవ్యాధి వస్తుందని, ఈ వ్యాధి సోకిన పశువులకు జ్వరం వస్తుందని, వంటిపై బొబ్బలు ఏర్పడి, అవి నల్లని మచ్చలుగా ఏర్పడతాయని డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. ఈ వ్యాధి సోకకుండా గోట్ ఫాక్స్ వ్యాక్సిన్ వేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ వ్యాక్సిన్‌ను సహజంగా మేకలకు వేస్తామని, అదే వ్యాక్సిన్ను ఇప్పుడు తెల్ల జాతి పశువులకు వేస్తున్నామని చెప్పారు. పశువులకు మంచి పోషక విలువలు ఇచ్చే దాణామృతాన్ని రైతులకు కేజీ ఆరున్నర రూపాయలకు ఇస్తున్నట్లు చెప్పారు. దాణామృతంలో అన్ని రకాల పోషక విలువలతో కూడిన ఆహారం ఉంటుందని, రోజుకు ఒక్కో గేదెకు 20 నుంచి, 25 కిలోల లోపు పెట్టవచ్చని తెలిపారు. జొన్నలు కూడా తమ వద్ద ఉన్నాయని, కిలో 23 రూపాయలు చొప్పున ఇస్తామని తెలిపారు. కావలసిన రైతులు తమను సంప్రదించాలని డాక్టర్ మల్లేశ్వరి కోరారు.

సీఈసీ కళాశాలలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి-చీరాల: చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. వేటపాలేనికి చెందిన నూతన డైరెక్టర్ కట్టా జై దర్శకత్వంలో కృష్ణకాంత్, విజయ్ ప్రధాన పాత్ర పోషించిన సినిమా షూటింగ్ చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వేటపాలెం ప్రాంతానికి చెందిన కట్టా జై ఈ సినిమాకి దర్శకత్వం వహించడం హర్షణీయమన్నారు. ఈ సినిమా ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ జై మాట్లాడుతూ మహిళల పట్ల వివక్షత, బాలిక విద్య, ప్రాధాన్యత అంశాలతో కూడిన వైవిధ్యమైన కథ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. అనంతరం తరగతి గదిలో సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

ఫ్యాన్సీ డ్రస్సులతో చిన్నారుల సందడి

ప్రజాశక్తి-చీరాల: చీరాల రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో యువజన వారోత్సవాలలో భాగంగా పలువురు చిన్నారులు ఫ్యాన్సీ డ్రస్సులతో సందడి చేశారు. వారోత్సవాలలో అయిదో తరగతి లోపు చిన్నారులకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన 105 మంది చిన్నారులు చూడముచ్చటగా ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పూటకూరి విజయ కుమారి, పి నళిని, పూరా మాధవి, వ్యవహరించారు. వలివేటి మురళీకృష్ణ, సుభాషిణి, జి.లలితకుమారి, పార్వతీదేవి, ఆలపాటి ఉషా, పోలుదాసు రామకృష్ణ పి శివాంజనేయప్రసాద్, డివి సురేష్, బి హేమంత్ కుమార్, శ్రీరాం రమేష్, ప్రతాప్, ఎంవి రామారావు పాల్గొన్నారు.

ఆ వైద్యాధికారులను మేల్కొల్పండి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గర్భిణులు, కిశోర బాలికలలో రక్తహీనత, పోషణ లోపం నివారణకు వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. నిద్రావస్థలో ఉన్న వైద్యాధికారులను మేల్కొల్పండి. విధులకు గైర్హాజరైనవారు, దీర్ఘకాల సెలవుపై వెళ్లిన వైద్యాధికారులపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మాత, శిశు మరణాలు గత నెలలో నమోదు కావడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే దృక్పథంతో వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. మెరుగైన వసతుల కల్పన కోసం నాడు-నేడు కింద వైద్యశాలలు నిర్మిస్తూ మరమ్మతులు చేస్తుందన్నారు. గర్భిణులు, కిశోర బాలికలలో రక్తహీనత అరికట్టడానికి సంపూర్ణ పోషణ వంటి వివిధ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తాజాగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మంచి వైద్యం అందించేలా అధికారులు కృషి చేయాలని విజయకృష్ణన్ తెలిపారు. బాపట్ల జిల్లాలో 17 లక్షల జనాభా ఉండగా ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 50 వేల మంది బిపితో, మరో 40 వేల మంది చక్కెర వ్యాధితో బాధపడుతున్న విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల జిల్లా గ్రామీణ ప్రాంతాలలోని 43 పిహెచ్‌సిలలో ఆరోగ్యశ్రీ అమలవుతుండగా పట్టణ ప్రాంతాలలో 12 వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందడంపై ఆరా తీశారు. 108 అంబులెన్స్ వాహనాలు 25 నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఔషధాల కొరత లేకుండా అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. 3,665 మంది కిశోర బాలికలలో రక్తహీనత, పోషణ లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారి ఆరోగ్యం మెరుగుపడేలా చూడాలన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎంపిక చేసిన 25 లేఅవుట్లలలో విద్యుదీకరణ, తాగునీటి వ్యవస్థ, రహదారుల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులకు ఉద్యోగాలు పోతాయని కలెక్టర్ హెచ్చరించారు. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఓ కె లక్ష్మీ శివజ్యోతి, డిఎంహెచ్ఓ ఎస్ విజయమ్మ, డిసిహెచ్ఎస్ కె విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తామర పురుగుతో రైతులకు నష్టం

ప్రజాశక్తి-పంగులూరు

ప్రస్తుత పరిస్థితుల్లో మిర్చి పైరుకు తామర పురుగు తీవ్రత బాగా ఉందని, దీనివల్ల రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉందని, ఈ విషయమై జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్తానని, హార్టికల్చర్ అద్దంకి డివిజన్ అధికారి దీప్తి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండమూరు గ్రామంలో, సాగుచేసిన ఖరీఫ్ మిర్చి సాగును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ, ఖరీఫ్ మిర్చికి తామర పురుగు విపరీతంగా సోకిందని, దీనివల్ల రైతులు బాగా నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ఏ రకం పురుగులకు ఏ రకం మందులు వాడాలి, తెగుళ్లను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కొండమూరు గ్రామ నువ్యవసాయ సహాయకులు జాగరణ మోడీ దినేష్, రైతులు, పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి


మాట్లాడుతున్న మోపిదేవి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. చెరుకుపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ మోపిదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో గడపగడపకు సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ కార్యక్రమాలు అందజేయాలని కోరారు. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు మత్తి దివాకర రత్న ప్రసాద్ అధ్యక్షత వహించగా, సమావేశంలో ఎంపీడీవో బి శ్రీనివాసరావు, జడ్పిటిసి మరివాడ పావని తదితరులు పాల్గొన్నారు.


పూర్ణచంద్రరావును సన్మానిస్తున్న కర్లపాలెం ఎంపిడిఓ ఎలీషాబాబు

జనరల్ సెక్రటరీగా పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి-కర్లపాలెం

బాపట్ల జిల్లాలో నూతనంగా ఏర్పడిన డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతిపథం ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీగా కర్లపాలెం మండలంలో సిసిగా పని చేస్తున్న శొంటి పూర్ణచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నిక కావటం అభినందించదగ్గ విషయమని కర్లపాలెం ఎంపిడిఒ అమృతలూరు ఎలీషాబాబు అన్నారు. స్థానిక కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శొంటి పూర్ణచంద్రరావును ఆయన దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీత పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఏకగ్రీవంగా ఎంపికచేసిన వైఎస్ఆర్ కేపి ఉద్యోగులందరికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు, రాష్ట్ర విఓఎ సెక్రెటరీ కే లక్ష్మి, ఎపిఎం శ్రీనివాసులురెడ్డి, సిసిలు లక్ష్మి శివకోటేశ్వరరావు, విఓఎలు మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీ

ప్రజాశక్తి-రేపల్లె

పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై శానిటరీ సెక్రటరీలు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రేపల్లె మున్సిపల్ కమిషనర్ బి విజయ సారధి ఆదేశానుసారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ సిబ్బందితో కలిసి రేపల్లె పట్టణంలోని బస్టాండ్ దగ్గర నుంచి లక్ష్మీ టాకీస్ సెంటర్ వరకు రోడ్డు మార్జిన్‌లో గల పలు దుకాణాలను శానిటరీ సెక్రటరీలు పరిశీలించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ని వాడితే అపరాధ రుసుం వసూలు చేస్తామని అవగాహన కల్పించారు. పండ్ల వ్యాపారుల వద్ద దొరికిన కవర్లను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ సాంబశివరావు, కళ్యాణి, శానిటరీ మేస్త్రి ముఖర్జీ, షేక్ రబ్బాని, లక్ష్మీనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రదర్శన

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: జాతీయ స్థాయి లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ఇంకొల్లు లో ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబ రు 23వ తేదీ వరకు స్వయం సహాయక సంఘం సభ్యులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. లింగ వివక్ష, బాల్యవివాహాలు, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ, గృహహింస వంటి వాటిపై గ్రామ, మండల స్థాయిలో ప్రదర్శనలు, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపిఎం ఎం కరుణాకర్, స్వయం సహాయక సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఇంకొల్లులో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి: మోపిదేవి

ప్రజాశక్తి-నిజాంపట్నం

ప్రజల సమస్యలు తీర్చేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలో మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. త్వరలోనే మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జలజీవన్ మిషన్ కింద తాగునీటి సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు రేపల్లె నియోజకవర్గానికి సుమారు 120 కోట్లు రూపాయిలు కేటాయించారని తెలిపారు. నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరినాథ్ బాబు, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, రేపల్లె ఆర్డిఓ రవీంద్ర, ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి, తహశీల్దార్ ఎం శిరీష పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలు అందించడం వాలంటీర్ల బాధ్యత

ప్రజాశక్తి-చీరాల


వాలంటీర్లతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా ప్రజలకు అందజేస్తున్న పలు పథకాలను రెవెన్యూ సేవలను ప్రజలకు సకాలంలో అందించటం వాలంటీర్ల బాధ్యత అని కొత్తపేట పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రెవెన్యూ సేవలను ప్రజలకు సకాలంలో అందజేయాలని, సేవల విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది అందరూ పంచాయతీ అభివృద్ధికి సహకరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాల పంపిణీలో ఎలాంటి సందేహాలు ఉన్నా తన దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు. అనంతరం వాలంటీర్లకు పలు విషయాలపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలను చేశారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి: బలరాం

ప్రజాశక్తి-చీరాల: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కమిషనర్ ఏసయ్యను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 17,18 వార్డులో నల్ల గాంధీ బొమ్మ రోడ్డులో జరుగుతున్న రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు నాయకులు ఉన్నారు. అదేవిధంగా ఎంజీసీ కాలనీ రైల్వే గేట్ సమీపంలోని డ్రైనేజీ పారుదల కాలువలను మునిసిపాలిటీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పరిశీలించారు. డ్రైనేజీ పారుదలకు శాశ్వత పరిష్కారం జరిగే విధంగా తగు చర్యలను త్వరలోనే చేపడతామని ఆయన అన్నారు.

జాగా కనిపిస్తే.. పాగానే!

- పోరంబోకు భూమిలో అక్రమ కట్టడాలు
- పట్టించుకోని క్షేత్రస్థాయి అధికారులు

ప్రజాశక్తి-వేటపాలెం

అక్రమ కట్టడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. జాగా కనిస్తే చాలు పాగా వేయాల్సిందేనని అక్రమార్కులు ఉవ్విళ్లూరుతున్నారు. అధికారుల వాట్సాప్ గ్రూపుల్లో అక్రమ కట్టడాలు గురించి ప్రచారం అవుతున్నా స్థానిక అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని చల్లారెడ్డిపాలెం నుంచి అక్కాయపాలెం వెళ్లే డొంక పోరంబోకు అసైన్డు భూమిలో మరో అక్రమ కట్టడం వెలిసింది. ఈ అక్రమ కట్టడం నాయుడుపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 31, సబ్‌డివిజన్ 2లో ఉంది. ఈ భూమిలో రెండు ఎకరాల 14 సెంట్ల భూమిని సేద్యం నిమిత్తం ప్రభుత్వం పంపిణీ చేసింది. మొత్తం ఇరవై ఎకరాల్లో చిన్న సన్నకారు రైతులకు ఆహార ధాన్యాలు సేద్యం చేసి పండించి జీవనం సాగించడానికి కొంతమంది నిరుపేదలకు అసైన్డ్ భూమిని పంపిణీ చేశారు. ఆ భూముల గుండానే చల్లారెడ్డిపాలెం నుంచి అక్కాయపాలెం వెళ్లే డొంక కూడా ఉంది. ఎలాంటి కట్టడం చేపట్టాలన్నా ముందుగా స్థానిక పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు ల్యాండ్ కన్వర్షన్‌ను చేసుకోవాల్సి ఉంది. వివిధ శాఖలకు సంబంధించిన అధికారుల పర్యేక్షణ నిరంతరం ఉండాలి. ఇక్కడ అక్రమ కట్టడాలు పూర్తి చేసుకొని రంగులు సైతం పులుముకొన్నాయి. అయినా రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే వారం రోజుల క్రితమే ఈ అక్రమ కట్టడం గురించి అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తినా ఎలాంటి శాఖపరమైన చర్యలు తీసుకొన్న దాఖలాలు లేవు. కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగం ఉదాశీనంగా వ్యవహరించడం వల్లే అక్రమార్కులు పెట్రేగిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇవేవీ అధికారుల చెవికి ఎక్కకపోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ అక్రమ కట్టడం గురించి ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.


చల్లారెడ్డిపాలెం నుంచి అక్కాయపాలెం వెళ్లే డొంక పోరంబోకు సర్వే నెంబర్ 31/2లో నిర్మించిన అక్రమ కట్టడం

పచ్చాకు ముఠా కూలీలకు రక్షణ కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-టంగుటూరు

పచ్చాకు ముఠా కూలీలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎం.నిడమలూరులో పచ్చాకు ముఠా కూలీలు, మేస్త్రీలు, డ్రైవర్లతో గ్రామ నాయకులు పిడుగురాళ్ల లింగయ్య అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 80 వేల ఎకరాలకు పైగా పొగాకు సాగవుతుందన్నారు. 50వేల మందికి పైగా కూలీలు పొగాకు పైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 130 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుండగా దాదాపు 100 మిలియన్ కిలోలు ప్రకాశం జిల్లాలోని ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కంకణాల అంజనేయులు

దేశవ్యాప్తంగా 60 లక్షల మంది రైతులు, 2 కోట్ల మంది కూలీలు పొగాకు పైనే ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకున్నట్లు ఆయన తెలిపారు. పొగాకు ఎగుమతుల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఏటా రూ.6,500 కోట్లు ఎగుమతి సుంకం, రూ.3,500 కోట్లు విదేశీ ద్రవ్యం రూపంలో ఆదాయంగా లభిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తులు, విక్రయాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54 వేల కోట్ల ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వాలకు ఆదాయం వస్తున్నప్పటికీ అందుకు కారకులైన రైతులు, కూలీల రక్షణ గురించి ప్రభుత్వాలు, పొగాకు బోర్డు అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేశపోగు మోజెస్, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకుడు ఎస్‌కె.మీరాస్ మాట్లాడుతూ పచ్చాకు కార్మికుల సమస్యలు, పరిష్కార మార్గాలు, కార్మికుల హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వచ్చాకు ముఠా కూలీలు, మేస్త్రీలు పి.లింగయ్య, గుంటి దాసు, పిడుగురాళ్ల వెంకటేశ్వర్లు, చాటగడ్డ జ్యోతి, మద్దులూరి కొండయ్య, జాలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తంబి శ్రీనివాసులు

29న ఆటో యూనియన్ నగర మహాసభ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆటో యూనియన్ ఒంగోలు నగర మహాసభ ఈనెల 29న జరుగుతుందని, ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మిక సమస్యలు పరిష్కార దిశగా యూనియన్ పని చేస్తుందన్నారు. ఆటో కార్మికుల సమస్యలను చర్చించి ఆటో కార్మికుల రక్షణ కోసం ఈనెల 28న ఉదయం 11 గంటలకు సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభ జరుగుతుందన్నారు. ఈ సభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, ఒంగోలు సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, ఆటో యూనియన్ రాష్ట్ర నాయకులు పాల్గొని ఆటో కార్మికులకు దిశ నిర్దేశం చేస్తారన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేయాలని, ఏ స్టాండ్ లో ఉన్నాయో ఆ స్టాండ్‌లోనే పర్మిట్ చేయాలని మహాసభలో తీర్మానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నగర అధ్యక్షుడు దాసరి రమేష్, నగర నాయకులు ఎ. సింగయ్య డి.ఆనంద్, ఎ. కోటేశ్వరరావు, బి. బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ముత్తముల అశోక్‌రెడ్డికి సన్మానం

గిద్దలూరు : వచ్చే ఎన్నికల్లో గిద్దలూరు నియోజక వర్గ టిడిపి అభ్యర్థిగా ముత్తుముల అశోక్ రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. అందులో భాగంగా అశోక్ రెడ్డిని నియోజక వర్గ పరిధిలోని టిడిపి నాయకులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నంది శ్రీనివాసులు, బూనెబోయిన చంద్ర శేఖర్ యాదవ్, శీలం కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఎబిఎం పాలెంలో నూతనంగా నిర్మించిన తెలుగు బాప్టిస్టు చర్చిని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గిద్దలూరు నియోజక ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు పందిటి రజనీ బాబు, రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు గోన చెన్నకేశవులు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గుర్రం దానియేలు, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు పానుగంటి ఇజ్రాయిల్, పార్లమెంటు ఎస్‌సి నాయకులు కత్తి అనోజీరావు, యామా సంజయ్, తలపాటి దివాకర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి సమావేశాలు జయప్రదం చేయండి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో డిసెంబర్ 10,11 తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విస్తత స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఈ సమావేశాలకు ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పిసాను, అఖిల భారత మాజీ అధ్యక్షుడు వై. వెంకటేశ్వరరావు, రాష్ట్ర ముఖ్య నాయకత్వం, వివిధ యూనివర్సిటీల ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, రాష్ట్రంలోని 26 జిల్లాల ముఖ్య నాయకత్వం పాల్గొంటారన్నారు. విద్యా రంగంలో వచ్చిన మార్పులను చర్చించి, విద్యా రంగంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తారన్నారు. ప్రాముఖ్యత కలిగిన ఈ సమావేశాలలో విద్యార్థి లోకం పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు శశాంత్, హేమంత్, నగర ఉపాధ్యక్షుడు చైతన్య పాల్గొన్నారు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఐక్య పోరాటాలు : హనీఫ్

హనుమంతునిపాడు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ తెలిపారు. సిఐటియు నాయకుడు చింతకుంట్ల ఏసు అధ్యక్షతన లేబర్ కోడ్‌లు వాటి యొక్క ప్రమాదం అనే అంశంపై ఓపెన్ స్టడీ సర్కిల్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఇప్పటి వరకూ కార్మికులు, ఉద్యోగులు అనేక ఉద్యమాలు, ప్రాణ త్యాగాలు చేసి హక్కుల రక్షణ, పని గ్యారెంటీ, వేతన చట్టం, సామాజిక భద్రత కోసం చట్టాలు సాధించుకున్నట్లు తెలిపారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని నిర్వీర్యం చేసేందుకు కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించినట్లు తెలిపారు. ఈ లేబర్ కోడ్‌ల కారణంగా ఉద్యోగులు, కార్మికుల తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక వర్గం నిరంతరం చైతన్యవంతంగా ఉండాలన్నారు. ౧. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉస్తేల నారాయణ, రవి, నాసర్ మహమ్మద్, గురవయ్య, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకుడు కనకరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గాలిమోటు ఏసేపు, పోతురాజు మంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

విద్యారంగ బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బేస్తవారిపేట

నాడు- నేడు పథకం ద్వారా విద్యారంగ బలోపేతానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు- నేడు పథకం ద్వారా నిర్మిస్తున్న మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.37 లక్షలతో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వేగినాటి ఓసూరారెడ్డి, జడ్‌పిటిసి బి. వెంకటరాజు, సర్పంచి తాళ్ల అరుణ, ఎంపిటిసి బండి నాగారత్నమ్మ, ఎంఇఒ జింకా వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రావు, స్కూల్ కమిటీ చైర్మన్ కష్ణంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు


జగనన్న కాలనీని పరిశీలిస్తున్న పీడీ సీనారెడ్డి

జగనన్న కాలనీల్లో పరిశీలన

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండల పరిధిలోని తోకపల్లి గ్రామంలోనున్న జగనన్న కాలనీ లేఅవుట్లను మండల ప్రత్యేక అధికారి, జిల్లా డ్వామా పీడీ కె.సీనారెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం జగనన్న కాలనీ లబ్ధిదారులతో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జగనన్న కాలనీల లబ్ధిదారులు త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దష్టికి తీసుకు రావాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజ్‌కుమార్, ఎపిఒ సాంబశివయ్య, ఎపిఎం శ్రీనివాసులు, జిలెల్ల మల్లేశ్వరి, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్‌అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు. **దొనకొండ :** మండల పరిధిలోని బాదాపురం, రుద్రసముద్రం గ్రామాల్లోని జగనన్న కాలనీలను ఎంపిడిఒ వి.వసంతరావునాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిశంబరు 25 నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా పనులు వేగవంతం చేయించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తయిన గృహాలకు బిల్లులు చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొంగలేటి గ్రేస్‌రత్నదేవానంద్, ఎపిఒ తగరం దేవయ్య, ఎంపిటిసి ఆది సుబ్బారావు, కార్యదర్శి పి.క్రిష్ణమూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** జగనన్న కాలనీల లబ్ధిదారులు త్వరిత గతిన నిర్మించుకొనేలా అధికారులు కృషి చేయాలని తహశీల్దారు ప్రసాదరావు తెలిపారు. మండల పరిధిలోని గొట్లగట్టు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ దిలీప్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గీత, సర్పంచి సుఖదేవ్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలు నాయక్, మాజీ ఎంపిటిసి వెంకటయ్య పాల్గొన్నారు. **శింగరాయకొండ :** మండల పరిధిలోని పాకల గ్రామంలోనున్న జగనన్న కాలనీ లే అవుట్‌ను మండల స్థాయి అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాకల గ్రామానికి చెందిన వైసిపి విద్యార్థి విభాగం నాయకుడు దామతోటి శ్రీనివాసులు అధికారులకు వినతిపత్రం అందేశారు. గృహ నిర్మాణాలను పరిశీలించిన వారిలో తహశీల్దారు సిహెచ్.ఉష, ఎంపిడిఒ జమీఉల్లా, హౌసింగ్ ఎఇ నాగరాజు ఉన్నారు. **పొన్నలూరు :** మండలంలోని రావులకొల్లు, వెంకుపాలెం గ్రామాల్లోని జగనన్న కాలనీ లే అవుట్లను హౌసింగ్ ఎఇ సుబ్బారావు, ఆర్‌ఐ రాజు, ఎపిఎం సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎఇ సుబ్బారావు మాట్లాడుతూ జగనన్న గృహాల లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

27న ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు కలెక్టరేట్ : ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపికలు స్థానిక రాజీవ్ నగర్‌లోని నారాయణ పబ్లిక్ స్కూలులో ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. అండర్-14 విభాగంలో ఎంపికలకు 2002 జనవరి 1న పుట్టినవారు, అండర్-17 విభాగానికి 2005 జనవరి 1న పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఈ ఎంపికకు వచ్చే ఫెన్సింగ్ క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్, 2 పాస్ పోర్ట్ సైజుఫొటోలు, ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు తమవెంట తెచ్చు కోవాలన్నారు.

రైతు భరోసా కేంద్రాలలో తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని కటకానిపల్లి, చిన్నగుడిపాడు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మండల వ్యవసాయశాఖాధికారి డి.జవహర్‌లాల్‌నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకము, రైతు భరోసా పథకము, పిఎం కిసాన్ పథకం, ఈ కేవైసీ, ఈ క్రాప్ నమోదు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి.హరిజననాయక్, గ్రామ ఉద్యానవన సహాయకులు డి.శ్వేత, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న డాక్టర్ స్వామి

కోటమ్మకు ఎమ్మెల్యే స్వామి నివాళి

ప్రజాశక్తి -శింగరాయకొండ

మండల పరిధిలోని ఊళ్ల పాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు రేణుమాల కుమార్ తల్లి రేణుమాల కోటమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈ విషయం గురించి తెలుసుకొన్న కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కోటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూనపు రెడ్డి, వెంకటసుబ్బారావు, బాయిరెడ్డి ,మురళి, నూతలపాటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-సిఎస్ పురం

మండలంలోని కోవిలంపాడు-మిట్టపాలెం గ్రామంలోని నారాయణస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకులు జివి.సత్యనారాయణ, కందుకూరు డివిజన్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాదికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి సమక్షంలో హుండి లెక్కింపు జరిగింది. గత మూడు నెలల హుండీ ఆదాయం రూ. 12,54,526లు, అన్నదానం ద్వారా రూ.30,900 లు వచ్చినట్లు ఆలయ ఇఒ తెలిపారు. ఈ కార్యక్రమములో ట్రస్ట్ బోర్డు సభ్యులు మంచికంటి మధుసూధనరావు, జిలకర అంజనాదేవి, రాగి రత్తమ్మ, పుల్లయ్య, ముడుమాల నారాయణరెడ్డి, నన్నసాని యయాద్రి, ఆలయ అర్చకులు, గ్రామస్తులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొనారు.



మధ్యాహ్నభోజనంను పరిశీలిస్తున్న ఎంఈఓ టి రవి

సవరించిన మెనూను అమలు చేయాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం సవరించిన మెనూను అమలు చేయాలని ఎంఇఒ టి రవి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పాటిమీదపాలెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రికార్డులను, యాఫ్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ఎస్‌కె శిలార్, ఉపాధ్యాయులు ఎన్ఎల్ శివపార్వతి పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల మహిళలు శ్రద్ధ వహించాలి

ఎస్‌పి మల్లిక గర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

విధి నిర్వహణలో నిమగ్నమయ్యే మహిళలు తమ ఆరోగ్య సంరక్షణ పట్ల తగినంత శ్రద్ధ వహించాలని, అలా ఉంటేనే నిర్ధిష్ట లక్ష్యాలను సాధించగలుగుతారని ఎస్‌పి మలికాగర్గ్ తెలిపారు. స్త్రీ హింస నిర్మూలనా దినోత్సవం స్థానిక పోలీస్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013ను పకడ్బందీగా అమలు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడితే వారిపై ధైర్యంగా ముందుకు వచ్చి.. కమిటీకి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళా సిబ్బంది ఆరోగ్యంపై తీసుకో వలసిన జాగ్రత్తల కోసం వైద్యులతో అవగాహన కార్య క్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులుగా ఎఎస్‌పి కె.నాగేశ్వరరావు(అడ్మిన్), డిపిఒ ఎఒ ఎం.సులోచన, సూపరింటెండెంట్ డి.శైలజ, దిశా పిఎస్ ఎస్ఐ కె.దీపికా, చైర్మన్‌గా ఎస్‌పి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు, మహిళా ఎస్ఐలు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

చట్టాలు మారినా స్త్రీకి రక్షణ కరువు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎన్నిచట్టాలు మారినా మహిళలలకు మాత్రం రక్షణ కరువైందని ఆర్‌డిటి ఏరియా టీమ్ లీడర్ గిరిజ అన్నారు. శుక్రవారం ఆర్‌డిటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలనా దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజ మాట్లాడుతూ బలమైన చట్టాలున్నప్పటికీ అడుగడుగునా లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మరోవైపు సమాజంలో అమ్మాయిలకు భద్రత ఉండదనే ఒక్క కారణంతో చాలా మంది తల్లిదండ్రులు తమ కూతుళ్లను ఉన్నత చదువులు చదివించేందుకు వెనుకాడుతున్నారని తెలిపారు. మహిళలు వారికి అవసరమైన చట్టాల గురించి అవగాహన పెంచుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి ఆర్గనైజర్లు, హెల్త్ ఆర్గనైజర్లు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** దోర్నాల మండల పరిధిలోని ఆర్‌డిటి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో ఆడిటోరియంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలనా దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం ట్రాన్స్‌పోర్టు డైరెక్టర్ నిర్మల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిగూడెంకు చెందిన నాగమ్మ అనే మహిళ ఆర్‌డిటి సంస్థ వద్ద మహిళల జీవన విధానంలో మార్పులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా టీమ్ లీడర్ నర్సింగరావు, దోర్నాల మండలం చెంచుగూడెం ప్రజలు, ఆర్‌డిటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

రీ సర్వే ద్వారా పరిష్కారం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్ :

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం సర్వే ద్వారా భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుం దని మార్కాపురం తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలి పారు. శుక్రవారం మండల పరిధిలోని రామచంద్ర పురం సర్పంచి భోగం చిన్న లక్ష్మయ్య అధ్యక్షతన జగనన్న శాశ్విత భూహక్కు, భూరక్ష పథకంపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా తహశీల్దార్ హజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూవివాదాలను పరిష్కరిం చడం కోసమే భూహక్కు పథకం ప్రధానలక్ష్యం అని భూ యాజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తోట చందన, డిప్యూటీ తహశీల్దార్ షేక్ పర్వీన్, మండల విస్తరణ అధికారి ఎం.రామోహ్మన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి, విఆర్ఒ షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న దృశ్యం

ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన వికలాంగుడు పులగర శ్రీధర్‌బాబు పోలియో సమస్యతో నడవలేక పోతున్నాడు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకూలో సమస్యను గ్రామ నాయకులు దామచర్ల అనిల్, దామచర్ల బుజ్జి వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు దష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో మన్నం వెంకయ్య బాది తుడికి శుక్రవారం ట్రై సైకిల్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో మల్లవరప్పాడు ఎంపిటిసి దామచర్ల నాగయ్య, తూర్పునాయుడుపాలెంనాయకులు వడ్డేవోలు వెంకటేశ్వర్లు, అద్దంకి దినేష్, పసుమర్తి ఆనంద్, నాగేశ్వరరావు ఉన్నారు.



కలెక్టర్‌కు టిజెఆర్ వినతి

సంతనూతలపాడు నియోజకవర్గంలో జగనన్న లేఔట్ల సమస్యలపై ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

-ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్



జగనన్న కాలనీలో పరిశీలిస్తున్న ఎంపిడిఒ

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-చీమకుర్తి

జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ వండర్‌మెన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్‌ఎల్‌పురంలో జరిగిన హౌసింగ్‌డే కార్యక్రమం సందర్భంగా ఎంపిడిఒ, తహశీల్దార్ పిన్నిక మధుసూధనరావు, సర్పంచి పుల్లగూరరమణమ్మలతో కలిసి పలు గృహాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులంతా ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. తహసిల్దార్ పిన్ని మధు సూధనరావు మాట్లాడుతూ భూసమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఏ సుధాకరబాబు,విఆర్ఓ దాసరి రామారావు,ఇంజనీర్ జి సతీష్‌రెడ్డి, ఏపిఎం ఎల్‌కోటేశ్వరరావు,హౌసింగ్ ఏఈ ఎం రవికుమార్ పాల్గొన్నారు.

సేవలన్నీ యాప్‌లో పొందుపరచాలి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు చేసే సేవలన్నింటినీ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యాప్‌లో పొందుపరచాలని రాష్ట్ర నోడల్ అధికారులు డాక్టర్ సిహెచ్ శిరీష డాక్టర్ మాధవీలత ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక పిహెచ్‌సి ఆవరణలో సిబ్బందికి ఈ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ మండలంలోని గర్భవతుల పూర్తి సమాచారం వారి ఇంటి వద్దనే యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ వాణిశ్రీ, ఎన్ఆర్‌హెచ్ఎం, డిపిఎంఒ సుగుణమ్మ, డిపిహెచ్ఎన్ఓ కె వి సుబ్బలక్ష్మి, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్ ప్రసాద్ బాబు, సిహెచ్ఓ డిఎన్ వెంకటేశులు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



జంకె వెంకటరెడ్డిని సత్కరిస్తున్న వైసిపినాయకులు

'జంకె'ను కలిసిన కందుల

ప్రజాశక్తి-పొదిలి

వైసిపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మార్కాపుంర మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి సూచనల మేరకు విద్యార్థి విభాగాన్ని పటిష్టం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల రాజశేఖర్ తెలిపారు. జంకె వెంకటరెడ్డి మార్కాపురంలోని ఆయన నివాసగృహంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జంకె వెంకటరెడ్డి విద్యార్థి విభాగం జిల్లా కమిటీల గురించి చర్చించి పలు సూచనలు చేశారన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు రెళ్ళ అమర్నాథ్ రెడ్డి, నాయకులు ఏడుకొండల రెడ్డి, కాశీ విశ్వనాథ్, ఏసోబు, రాజారావు, డేవిడ్, రమేష్ రెడ్డి, ఇమానియేల్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: వైసిపి ప్రకాశంజిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని శుక్రవారం దోర్నాల మండల వైసిపి కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, పలువురు వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోర్నాల మండలంలో వైసిపి అభివృద్ధికి, రాబోయే ఎన్నికల్లో గెలుపుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జంకె వెంకటరెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట వైసిపి నాయకులు గంటా గురవారెడ్డి, వెన్నా రంగారెడ్డి, మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 7 వాహనాలకు శనివారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ లీనా తెలిపారు. తమ కార్యాలయంలోనే వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు డిపాజిట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో హాజరు కావాలని కోరారు.

ఆర్‌టిసిలో అద్దె బస్సులు తగ్గించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఆర్టీసీలో అద్దె బస్సులు తగ్గించాలని ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కోరారు. ఈసందర్భంగా శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కొత్తగా వస్తున్న ఎలక్ట్రికల్ బస్సులు నేరుగా ఆర్టీసీకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలియజేశారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిపో అధ్యక్షుడు జే శ్యామ్యూల్, జిల్లా అధ్యక్షుడు ఎం కుమార్, ప్రచార కార్యదర్శి ఉయ్యూరు శ్రీనివాసరావు, బి తిరుమల్ రెడ్డి, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

మగబిడ్డతో సమానంగా చూడాలి

ప్రజాశక్తి-అద్దంకి

కుటుంబంలోని ఆడ బిడ్డను మగ బిడ్డతో సమానంగా చూడాలని ఏరియా కోఆర్డినేటర్ కె.రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ కార్యక్రమం నిర్వహించారంటూ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి జెండర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జెండర్ మహోత్సవాలు గ్రామ స్థాయిలో జరుగుతాయని ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వివోఏలు, వివోలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-రేపల్లె

పట్టణంలోని రెండో వార్డులో గల ఆంధ్రప్రదేశ్ బాలయోగి గురుకుల పాఠశాలలో వసతి గృహాన్ని రేపల్లె ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెనూ పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం వెనుక వైపు ఎక్కువ లైటింగ్ వచ్చే విధంగా పురపాలక సంఘ కమిషనర్ విజయ సారథితో ఫోన్లో అప్పటికే మాట్లాడి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. చదువులపై తగు శ్రద్ధ చూపాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వెంకటగిరి కుమారి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అధ్యాపకులు పాల్గొన్నారు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కోన రఘుపతి

సంక్షేమ పథకాల బ్రోచర్లు పంపిణీ

ప్రజాశక్తి-కర్లపాలెం

గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా కర్లపాలెం మండలం కొత్త నందయపాలెం గ్రామంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి వైసిపి నాయకులతో కలిసి శుక్రవారం ఇంటింటికీమ తిరిగి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైసిపి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో కర్లపాలెం మండలం మరింత అభివద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సీతారామరెడ్డి, జెడ్పిటిసి వేణుగోపాల్‌రెడ్డి, కొత్త నందాయపాలెం సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, బుల్లయ్య, నాయకులు అయ్యప్పరెడ్డి, పేరాల వెంకట సురేష్, తాజ్, కుంట రత్నబాబు, శివారెడ్డి, లక్ష్మారెడ్డి, మునిరెడ్డి, జగ్గయ్య, అధికారులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోడీపాలనలో అరాచకాలు

సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య

ప్రజాశక్తి-కొండపి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య

ప్రధాని మోడీ పాలన అబద్దాలు, అరాచకాలతో సాగుతున్నదని సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య అన్నారు. శుక్రవారం కొండపిలో సిపిఎం కొండపి నియోజకవర్గస్థాయి కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు ఆయన ప్రారంభించారు. శిక్షణ తరగతులకు సిపిఎం మండల నాయకులు ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య అద్యక్షత వ్యవహరించారు. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ ఆంధ్రులు త్యాగాలతో స్థాపించుకున్న విశాఖ ఉక్కు ప్యాక్టరీ నాడు రూ5వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభమైతే నేడు కార్మికులు చేసిన త్యాగాలతో, తమ రక్తాన్ని చిందించి సృష్టించిన సంపదతో స్టీల్ ఫ్యాక్టరీ విలువ మూడు లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. అంత ఖరీదైన ఫ్యాక్టరీని కేవలం 30వేల కోట్లకు తమ తాబేదారులకు అప్పనంగా అప్పజెప్పేందుకు మోడీ సిద్దపడుతున్నారని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.వి కొండారెడ్డి మాట్లాడుతూ గడచిన ఎనిమిదేళ్ల కాలంలో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతున్నదని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు సమైక్యంగా పోరాడకుండా మోడీ ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, మండల కార్యదర్శి కెజి మస్తాన్, మండల నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల పెద్దపేతురు, గడ్డం వందనం, మల్లెల కొండయ్య,కాలే మల్లిఖార్జునరావు, వేజెండ్ల సింగయ్య, ఎల్.పరిశుద్ధరావు, పి.శ్రీనివాసరావు, పుట్టా రామారావు, వై.రూబెన్, యల్.సుకన్య, ఏ.అంజమ్మ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల పనితీరు మారాలి

మండల సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల



మాట్లాడుతున్న సభ్యుడు

మండలంలోని రెవెన్యూ శాఖ పనితీరు సరిచేసుకోవాలని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపిటిసి ఉడుముల రామనా రాయణరెడ్డిలు తహశీల్దార్ కెవిఆర్‌బి. ప్రసాదరావుపై ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి మోరబోయిన మురళీకష్ణ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై తహశీల్దార్‌కు, జడ్‌పిటిసి, ఎంపిటిసిల మధ్య కొద్దిసేపు వాదోపవాదాలు జరిగాయి. మండలంలో భూసమస్యలు పరిష్కారంలో అధికారులు విఫలమ వుతున్నారని దుయ్యబట్టారు. వాటిని పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటం బాధాకమన్నారు. సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చినప్పటికీ ప్రజలకు సేవలందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని అన్నారు. సాగర్ వాటర్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని, సమావేశాలకు సంబంధిత అధికారి రావటం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచులు, ఎంపిటిసిలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాహుల్ జనార్ధన్, మండల ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి, గొంగటి జెనీఫా, సిడిపిఒ సుధామారుతి, వైద్యాధికారి ఎస్‌పి బాలయ్య, ఎంఇఒ ఎస్‌కె.డాంగే షరీఫ్, నారాయణస్వామి, ఏపిఎం కె.గోపాలకష్ణారెడ్డి, ఎపిఓ శ్రీనివాసరెడ్డి, ఆర్టఇసి అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి, పశు వైద్యాధికారి అమూల్య, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉగ్ర

వైసిపిది రాజ్యాంగ వ్యతిరేక పాలన : ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక పాలనతో ప్రజలు ఇదేమి ఖర్మ అని గగ్గోలు పెడుతున్నారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి , మాజీ ఎమ్మెల్యేఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్యం. అప్రజాస్వామిక విధానాల ద్వారా ప్రజలపై ఆర్థిక భారం మోపేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఈకార్య క్రమంలో టిడిపినాయకులు ఆర్ శ్రీనివాసరెడ్డి, తమ్మినేని శ్రీని వాసరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి , వివిఆర్ మనోహ ర్‌రావు, రోషన్ సందాని, తిరుపాలు, నారాయణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీలోని మోడల్ స్కూల్ వద్దగల జగనన్న కాలనీని మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు శుక్రవారం సందర్శించి లబ్దిదారులతో మాట్లాడారు. సచివాలయ, హౌసింగ్, మున్సిపల్, మెప్మా సిబ్బందితో కలసి గృహనిర్మాణాల ప్రగతిని పరిశీలించారు. గృహనిర్మాణాలను వేగవంతం చేసి డిసెంబర్ 21నాటికి గృహ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఇ పి రామనాధం,మెప్మా టిఎంసీ కె రఘు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థల దానం

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కాకుటూరువారిపాలెం గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి తమ సొంత స్థలాన్ని గ్రామ సర్పంచి కొమ్మినేని వెంకట్రావు రెవెన్యూ అధికారులకు అందజేశారు. గ్రామంలోని సచివాయం చూడడానికి చిన్నదిగా, ఇరుకుగా ఉండడంతో కొత్త భవన నిర్మాణానికి అధికారులు స్థలం కోసం వెదకుతుండగా, సర్పంచ్ సర్వేనెం. 529లోని 0. 25 సెంట్లు స్థలాన్ని దానం చేసేందుకు సర్పంచ్ కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామానికి వచ్చి సదరు స్థలంలో కొలతలు వేయగా సర్పంచ్ కుటుంబ సభ్యులు సదరు స్థలాన్ని రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ కొమ్మినేని రమణమ్మ కుటుంబ సభ్యులకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి మాల్యాద్రి, ఎంఆర్ఐ యు వెంకటరత్నం, గ్రామ రెవిన్యూ అధికారి జి శివకుమార్, గ్రామ నాయకులు షేక్ బ్రహ్మయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, గుడిపూడి సుబ్బారావు, రవీంద్ర, పిడికిటి యలమంద తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చదువుకునేందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం జిల్లా విద్యా శాఖాధికారి రామారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్య, మనోజ్ మాట్లాడుతూ వెదులపల్లి చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చి దాదాపు 700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి సరిపడా వసతుల కల్పనలో అనేక ఆటంకాలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఈ సమస్యలపై పరిష్కారానికి చొరవ చూపి విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో గ్రామంలో విద్యార్థులను తల్లిదండ్రులను, గ్రామ పెద్దలను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు

విద్యుత్ బిల్లులు కట్టలేం.. : సర్పంచులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

విద్యుత్, నీటి బిల్లులు చెల్లించలేమని సర్పంచులు ఎంపిడిఒ రావూరి జనార్ధన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండల సర్వసభ్య సమావేశం ముగిసిన అనంతరం ఎంపిడిఒ జనార్ధన్‌కు సర్పంచులు కలిసి గతంలో పంచాయతీ నిధుల నుండి విద్యుత్ బకాయిలు, నీటి పన్నులు చెల్లించేవారు కాదని, ప్రస్తుతం చెల్లించటం భారంగా ఉందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే భారంగా ఉన్న పరిస్థితిలో ఇక మా ఆస్తులు అమ్ముకొని బకాయిలు చెల్లించాల్సిందేనని, అవి కూడా మా దగ్గర లేవని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

9న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అద్దంకి

జీవిత బీమా సంస్థల సంస్కరణను వ్యతిరేకిస్తూ డిసెంబర్ 9వ తేదీన తలపెట్టిన ఐఆర్‌డిఏఐ హైదరాబాద్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎల్ఐసి ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ రామకోటిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద ఐఆర్‌డిఏఐ జయప్రదం చేయాలని, ఎల్ఐసి ఏఓఐ ఐసిఈయు ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏఓఐ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి హనుమంతరావు, షేక్ కాలేషా బాషా, ఐసిఈయు అధ్యక్ష కార్యదర్శులు రామకోటమ్మ, తోట కూర సత్యనారాయణ ప్రసాదు, రవికుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

ప్రజాశక్తి-పిసిపల్లి

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పెదఇర్లపాడు ఆర్‌బికె వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రంపై పిసిపల్లి వ్యవసాయశాఖ అధికారి జి.వెంకటస్వామి అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యంకు కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలన్నారు. ఎవరైనా దళారులు మద్దతు ధర కంటే తక్కువగా అడిగితే అమ్మవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు మద్దతు ధర ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎడి ఇవి.రమణ, స్థానిక సర్పంచి పోలం లక్ష్మీదేవి, ఎఎలు శ్రీనివాసరెడ్డి, ఓంకారయ్య, రైతు మిత్రలు పాల్గొన్నారు. **అమర్తలూరు :** అమర్తలూరు మండల పరిధిలోని తురుమెళ్ల ప్యాపర్రు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్ తిరుమల దేవి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు గురించి రైతులకు అవగాహన సభను ఏర్పాటు చేశారు. ఈ పంట నమోదు చేసుకొని ఈ కెవైసి పూర్తయిన రైతులు తమ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలలో విక్రయించుకొనవచ్చని పేర్కొన్నారు. ఆర్‌బికేలో టెక్నికల్ సిబ్బంది ధాన్యం నాణ్యతను వారి పొలం వద్దనే పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర సాధారణ రకానికి ఒక క్వింటాకు రూ.2,040/-, ఏ గ్రేడ్ రకానికి రూ.2,060/-గా నిర్ణయించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్యాపర్రు గ్రామా సర్పంచ్ జి హేమచంద్ర శ్రీనివాస్, ఏఈఓ ఐ శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు బి మణికంఠ, డి బాల భాస్కర్, కె శ్రీనివాస్, ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం

అప్సడా వైస్ ఛైర్మన్ వి.రఘురామ్

ఒంగోలు కలెక్టరేట్ : ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా) వైస్ ఛైర్మన్ వడ్డి రఘురామ్ పేర్కొన్నారు. స్థానిక బృందావనం కళ్యాణ మండపంలో రొయ్య రైతుల సమస్యలపై గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతు నాయ ుకులు డి. గోపీనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ 2013 నుంచి ఆక్వా రంగం ఒడిదుడుకుల మధ్య నడుస్తుందని తెలిపారు. టిడిపిప్రభుత్వం రొయ్యరైతుల సంక్షేమాన్ని గాలి వదిలేసిన నేపథ్యంలో ఆ సమస్యలన్నీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వ్యాపా రులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రొయ్య లను కొనాలని లేకపోతే ఆ కంపెనీలపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. 100 కౌంట్‌కు మంత్రుల కమిటీ నిర్ణయించిన రూ.210 ధరను నిర్దేశించిన నేపథ్యంలో రైతులు కూడా తక్కువకు అమ్ముకోకూడదన్నారు. రైతులకు అంతకంటే తక్కువకు ఎవరైనా అడిగితే ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 9392705878 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. రాజ్యసభ సభ్యులు, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బీదా మస్తాన్ రావు మాట్లాడుతూ కోవిడ్‌తో చైనా ఎగుమతులను నిషేధించిన నేపథ్యంలో అంత ర్జాతీయంగా రొయ్యకు డిమాండ్ తగ్గిందన్నారు. ఆక్వా రైతాంగాన్ని ఆదుకునేందుకు కరెంటు సబ్సిడీ విషయంలో ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసు కుంటారని పేర్కొన్నారు. రొయ్య రైతులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆక్వా సాగు కష్టసాధ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావును అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ కొండూరి అనీల్ బాబు, ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రాజశేఖర్, అఖిలభారత ఆక్వా రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రాజు, దేవి సీఫుడ్ చైర్మన్ బ్రహ్మానందం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజా శక్తి - బాపట్ల జిల్లా

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించ డానికి జలజీవన్ మిషన్ కింద రాష్ట్ర ప్రభుత్వం బాపట్ల జిల్లాకు రూ.382.34 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసు కుందన్నారు. జిల్లా నుంచి అధికారులు పంపిన ప్రతిపాదనల మేరకు 697 పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో 129 పనులకూ రూ. 73.21 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో 76 పనులకు రూ 24.25 కోట్లు, చీరాల నియోజకవర్గంలో 64 పనుల కోసం రూ.23.35 కోట్లు, పర్చూరు నియోజక వర్గంలో 125 పనులకు రూ .117.79 కోట్లు, రేపల్లెలో 251 పనులకు రూ.122.70 కోట్లు, వేమూరులో 52 పనులకు రూ.21.02 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ వివరించారు. ఈ మేరకు జీవో ఆర్‌టి నెం: 918ని ప్రభుత్వం జారీ చేసిందన్నారు. 2024 మార్చిలోపు పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తించిన గ్రామాలలో నీటి పైపులైన్లు వేగంగా ఏర్పాటు చేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద చేపడుతున్న అభివృద్ధి పనులకు రూ.12.70 కోట్ల నిధులు జిల్లాకు మంజూరైనట్లు తెలిపారు. ఈప్పటికే పూర్తిచేసిన పనులకు తక్షణమే నగదు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తిచేసిన వాటికి ఆన్ లైన్ ద్వారా బిల్లులు సమర్పిం చాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చేపట్టిన పనులకు రూ .6.35 కోట్లు , పిఆర్ ఇంజినీరింగ్ అధికారులు చేపట్టిన పనులకు మరో రూ.6.35 కోట్ల నిధులు వచ్చాయన్నారు. నాణ్యతా ప్రమాణాలతో అభివద్ధి పనులు చేపట్టాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను వేగంగా చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సురేష్, గహనిర్మాణ శాఖ ఎస్ఇ ప్రసాద్, డివిజన్ స్థాయి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

నిర్వాసిత కాలనీల అభివృద్ధికి కృషి

జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

నిర్వాసిత కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. వెలుగొండ ప్రాజెక్ట్ పునరావాసకాలనీ మార్కాపురం మండలం, గోగులదిన్నె గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిర్వాసిత కాలనీల్లో సిసి రోడ్లు, డ్రెయిన్లు, అంగన్‌వాడీ, కమ్యూనిటీ హాలు, బిల్డింగులతో ఆధునిక సదుపాయాలు కల్పిం చాలన్నారు. చిల్డ్రన్స్ పార్క్, డిజిటల్ లైబ్రరీ, స్టడీ సర్కిల్, స్పోర్ట్స్ స్కూల్ తదితర మౌళిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో మార్కాపురం ఉప కలెక్టర్ సేతు మాధవన్, వెలుగొండ ప్రాజెక్టు ఎస్సీఈ అబుతాలిబ్, వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళావందనం, సర్పంచి వేల్పుల చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేసీ అభిషిక్త్ కిషోర్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసిత పోరాట సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి

నిర్వాసితులను ఆదుకోవాలి

మార్కాపురం : పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ జేసీ అభిషిక్త్ కిశోర్‌కు నిర్వాసిత పోరాట సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలవరం తరహాలో ఎప్పుడో ఇచ్చిన కొద్దిపాటి పరిహారంతో సరిపెట్టకుండా ఎకరాకు రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. గ్రామాలు ఖాళీ చేసే ఆరు నెలలు ముందుగా పరిహారాన్ని నిర్వా సితులకు అందజేయాలని కోరారు. నిర్వాహితుల కాలనీల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. గొట్టిపడియ పునరావాస కాలనీలో జరుగుతున్న పనులలో నాణ్యత లోపిస్తుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో నిర్వాసిత పోరాట సంఘం నాయకులు వేల్పుల వెంకట చెన్నా రెడ్డి, శ్రీను,ఎన్.శ్రీను, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, ఆవుల నాగిరెడ్డి, సుంకేసుల సర్పంచి జి.రమేష్, భీమవరపు సహదేవుడు, నందిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎన్ కాశీరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి : జేసీ

మార్కాపురం రూరల్ : జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. మార్కాపురం మండలం ఇడుపూర్-3 జగనన్న కాలనీలో చేపట్టిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గృహ నిర్మాణశాఖ అధికారులందరూ సమన్వ యంతో పని చేసి ఇళ్ల నిర్మాణాల్లో రోజురోజుకు పురోగతి కనిపించేలా కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో సిమెంట్, స్టీలు, ఇసుక అందజేయాలన్నారు. ఏమైనా సమ స్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఒ పవన్ కుమార్, మార్కాపురం మున్సిపల్ కమిషనర్ గిరిష్‌కుమార్, తహాశీల్దారు ఎం. శ్రీనివాస రావు, హౌసింగ్ ఎఇ చందు, ఆర్ఐ రమణయ్య పాల్గొన్నారు.

భూ రక్ష సర్వేను ఖచ్చితత్వంతో చేయాలి : అభిషిక్త్ కిషోర్

కంభం రూరల్ : జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష సర్వేలో భాగంగా సంయుక్త కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ కంభం మండలం జంగంగుంట్ల పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ సర్వే మ్యాప్‌లను, మ్యాప్ ప్రకారం ఇంటి కొలతలు, సర్వే రిజిస్టర్లు తనిఖీ చేశారు. సర్వే విధానం గురించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. 9(2) నోటీసులు పూర్తిగా డిస్ట్రిబ్యూషన్ చేసి అభ్యంతరాలు ఉంటే డిప్యూటీ తహాశీల్దారుకు అప్పీల్ చేసుకొనవాల్సినదిగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్‌కు తెలియజేసి వారి ద్వారా గ్రామాల్లోని ఇంటి యజమానులకు తెలియజేయమని ఆదేశించారు. అభ్యంతరాలు వ్యక్తం చేసిన యజమానుల వివరాలు 10(2) నోటీస్ ద్వారా యజమానులు నుంచి స్వీకరించి గ్రామ సర్వేయర్, సిబ్బంది మరియు డెప్యూటీ తహాశీల్దారు ద్వారా పరిష్కారం చేసి మారిన వివరాలను 42 కాలమ్స్ లో అప్డేట్ చేసి ఖచ్చితమైన కొలతలతో 9(2) నోటీసులు మళ్లీ ఇంటి యజమానులకు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ జివి.నారాయణరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-దర్శి

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వెంకటాచలంపల్లి వద్ద జగనన్న కాలనీ లేఅవుట్‌ను శు క్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుంటే వెంటనే బిల్లులు ఇచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. గృహాలను వేగవంతంగా లబ్ధిదారులు నిర్మించుకునేలా అధికారులు బాధ్యతహితంగా పనిచేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం దర్శి-2,4 సచివాలయాలను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో పీడీ పీరయ్య, తహాశీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపిడిఒ కుసుమకుమారి, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, ఎంఇఒ కె. రఘురామయ్య, ఎపిఒ కళ్యాణి, ఎపిఎం విజయ, సిడిపిఒ భారతి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆటల పోటీలు ప్రారభం

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూల గుంటపాడు బాలుర హైస్కూల్‌లో కొండపి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపిక కోసం శుక్రవారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపిఒ శివన్నా రాయణ, పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు వేంకటేశ్వర నాయక్ ప్రారంభించారు. ఆరు మండలాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికలు విభాగంలో 400 మంది పాల్గొన్నారు. పోటీలు శనివారం కూడా జరగనున్నాయి. ఈ కార్యక్రంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్లు చిరంజీవి రెడ్డి, టి.అశోక్ బాబు, మోహన్ రావు, సెలక్షన్ ఆర్గనైజర్స్ మాల్యాద్రి , జంషీర్, ,వెంకటరావు పాల్గొన్నారు.